# నిమజ్జనం

## తెనాలి సుశీలాదేవి

"అమ్మా: అదిగావాళ్ళే..."

ఒక్క వుదుటున చంకలోంచి జారిపోతున్న కొడుకును గబుక్కున ఎగేసి నడుముమీదికి కుక్కుకుని వాడు వేలు చూపిస్తున్నవైపు చూపు సారించింది ముత్యాలు.

వీధి కటూఇటూ పత్రి గుట్టలతోనూ, పూలూ, పళ్ళతోనూ నిండిపోయివుంది. కలువలు, తామరపూలు, మామిడి, నేరేడు, మారేడుకొమ్మలు వీధివీధంతా కళకళలాడుతోంది.

తల్లి చీర కుచ్చెళ్ళను పట్టుకుని ఆ చీరకున్న కన్నాన్ని వేళ్ళతో మరింత పెద్దది చేస్తూ పక్కనే నడుచుకొస్తున్న తొమ్మిదేళ్ళ కిష్టుడు తల్లిచూపు లెక్కడున్నాయో చూసి అసహనంగా కదిలాడు.

తమ్ముడు అడుగుతున్నది అవిగాదని తెలుస్తోంది వాడికి.

"రేయ్! ఎందు కట్టా యిట్టా పెనుగులాడ్తావ్! ఈ మందిలో తప్పోతే నే నెతుక్కోలేను నాయనా..." చేత్తో వాడి రెక్క బట్టుకుని యీడ్చి కుచ్చెళ్ళలోకి పొదువుకుంది కొడుకుని.

అప్పుడు చూపించాడు చేత్తో తల్లికి కిష్టుడు. "తమ్ముడు గావాల్నంటున్నది అది" అని సైగచేశాడు.

అదేమిటో ముత్యాలుకి తెలీకగాదు. కాకపోతే తల్లికి తెలుసని కిష్టుడికి తెలీదు.

శుద్ధమైన బంకమన్నుతో అచ్చుతీసిన వినాయకుళ్ళు, రంగుల రంగుల పూతలతో హంగామాగా కళకళలాడిపోతున్న, మెరసిపోతున్న వినాయకులు తళుకుళతో చేసిన రంగురంగుల గొడుగులు.

అంగళ్ళలోనూ, అంగళ్ళముందు తోపుడుబళ్ళలోనూ అమ్మకానికి సిద్ధంగావున్న బొమ్మలచుట్టూ జనం.

సైజువారీ వున్న వినాయకులను బేరమాడుతూ ... ఎన్నిక చేసుకుంటూ పెద్దలు, వాళ్ళచుట్టూ తమకు నచ్చినవే కొనాలని మారాంచేస్తున్న పిల్లలు... కళకళలాడిపోతున్న వాళ్ళ ముఖాలు...

క్షణమాత్రంలో ఇవన్నీ ఒక్క చూపులో చుట్టేసిన ముత్యాలు ఒక్క నిట్టూర్పు వదిలి గబగబా అడుగులు ముందుకువేసింది.

తల్లి ఆగి చూస్తుండేసరికి మెరపులా వుదయించిన ఆశ కోరిక అరక్షణంలో మాయమయినట్టుగా తోచి బిక్కముఖం వేసుకుని తనూ అడుగులు కలిపాడు కిష్టుడు.

తను చూపిస్తున్నవైపు వెళ్ళకుండా యింటిదారి పట్టిన తల్లిని పైటకొంగు లాగుతూ, పిడికిళ్ళతో గుద్దుతూ ఘొల్లుమన్నాడు చంటోడు.

"ఒరేయ్ సంటోడా! ఎందుకు అట్టా మొత్తుకుంటావ్? రేపు గొనుక్కుందాములే..." ఒక్క కసురు కసిరింది ముత్యాలు.

'యిట్టాంటి రేపు'లు మూడు బొయినాయి యీ పొద్దు నాలుగోది' మనసులోనే అనుకున్నాడు కిష్టుడు.

చంటోడికి అదేం తెలియటంలేదు. 'ఈ పొద్దు గుడక కొనీలే' అదే వాడి బాధ. కాళ్ళతో తన్నుతూ చేతులతో రక్కుతూ, ఏడుస్తూ నడుముమీంచి జారుతున్న చంటోడిని నాలుగు బాదింది ముత్యాలు. వాడిమీద పడుతున్న దెబ్బలు తనకూ తగులుతున్నట్టనిపించి ఏడుపొచ్చింది కిష్టుడికి.

బెక్కుతున్న వాడిని చూసి "నీకే మొచ్చిందిరా పోయేగాలం? సాల్నాలు, పొండి కొంపకు..." విసురుగా యీడ్చుకుంటూ నెట్టుకుంటూ గుడిశ చేరింది ముత్యాలు.

"యింగ సావు, యీ చాపమీంద. ఎంత సేపు ఏడుత్తవో నీ కోపికున్నంత ఏడ్చు" చంటోడిని చాపమిద కూలేసి నొప్పిబట్టిన రెక్క విదిలించుకుంటూ.

"ఒరే! కిష్టూ ఆ చాటలో నూకలు వున్నాయి యిట్ట తీసుకురా తండిరీ..." అంటూ చతికిలబడింది.

కిష్టుడు చాట తెచ్చి తల్లిముందర బెట్టినాడు.

చంటోడు తీసినరాగం తీయకుండా ఏడుస్తున్నాడు. చెవిటిదాన్లా పనిచేసుకుంటోంది ముత్యాలు.

కిష్టుడికీ చికాగ్గా వుంది. తల్లి మాటలకు కోపం వస్తోంది. తమ్ముడ్ని కొట్టినందుకు కోపమొస్తోంది. బొమ్మ కొనుక్కొని రానందుకు కోపం వస్తోంది. అయితే యిన్ని కోపాలు తల్లి ముఖంలోకి చూసేసరికి మటుమాయమయిపోతున్నాయి.

మొన్నటిరోజు వాడికి బాగా జ్ఞాపకముంది. ఆ రోజు–

తల్లి పనిచేస్తున్న శెట్టిగారింట్లో పెద్ద వినాయకుడి బొమ్మ రంగుల రంగులది కొనుక్కొచ్చారు. దాంతోపాటు యింగో సుమారుపాటు రంగుల బొమ్మా తెచ్చినారు. ఒకటేమో మూడోనాడు నీల్లలో యిడుస్తారంట, యింగోటి గాదె మీద పెడతారంట.

"అంటే ఏందే..."

అమాయకంగా అడుగుతున్న కొడుకుని యింటి ఎనకాల వున్న యింకో చిన్న యింట్లోకి తీసకపోయింది,

"ఆ యింట్లో వడ్ల గరిశల మీద, గాదెల మీద ఎన్ని వినాయకయ్య బొమ్మలు" నోరు వెళ్ళబెట్టేసినాడు.

"అమ్మా! వాళ్ళింట్లో యిన్నున్నయ్ గదే. తమ్మునికి యిమ్మని ఓ ఒడగరాదూ" 'నీకీ మాత్రం ఆలోచన రాలేదు' అన్నట్టు చూస్తూ చెప్పాడు.

"ఆల్లెందు కిస్తార్రా. అదే పనిగా రొండు రొండు తెచ్చుకుంటారు ఎప్పుడూ యీడ బెట్టడానికే గదా..." నిర్లిప్తంగా అంది ముత్యాలు.

"ఏంటికి అట్ట బెట్టేవి..."సందేహంగా అడిగాడు.

"గరిశల్లో దాన్యాలు తియ్యకుండా బందుతాయంట! మనకేం తెలుసులే అయ్యన్నీ పద...పద..."

వెనక్కు తిరిగిన తల్లి కొంగు పట్టుకున్నాడు గట్టిగా.

చిరాకుగా చూసింది ముత్యాలు.

"అదిగిసూడవే, తమ్ముడేడుస్తున్నాడని......" గొణిగాడు.

తనకూ అట్టాంటి బొమ్మ గావాల్నుంది. అయినా తమ్ముడు సిన్నోడుగదా ఆడికోసరమైనా అడుగుతుందని.

పనంతా అయినంక చేతులు కొంగుకు తుడుచుకుంటూ, చీరకుచ్చెళ్ళు కిందికి దిందుకుని 'ఎల్లొస్తానమ్మా' అంటూ ఎనక్కి దిరిగిన అమ్మను మెల్లగా లాగి గిల్లి సైగచేశాడు.

"ఓరినీ! యిడిసిపెట్టవు గదరా...." మురిపెంగానే విసుక్కుంటూ. "అమ్మా! పిల్లోల్లు దిన్నం ఏడుస్తాన్నారు యినాకమయ్య బొమ్మ గావాల్నని. కొనుక్కుందామంటే రూపాయ్రూపాయలు యాడదెచ్చి సచ్చేది. మీకాడున్న బొమ్మల్లో ఓ బొమ్మ యిప్పించండమ్మా...

వాడికి బాగా నచ్చింది తల్లి అడిగిన తీరు. తప్పకుండా యిస్తారనిపించింది వాడి మనసుకి.

"ఏందే ముత్యాలు. తెలిసి అడుగుతున్నావా? తెలీకా! గరిశల మీదకని, పూజకని ప్రతి ఏడూ రెండేసి వినాయకుళ్ళు తెప్పిస్తాం. ఒకటి నీళ్ళలో వదిలి ఒకటి ధాన్యపురాశి నెక్కిస్తాం. రాశి మీదున్నది అడుగుతావేం. వాటిని తియ్యం. కావాల్నంటే ఓ రూపాయిస్తా కొనుక్కో..."

కొంగుముడి విప్పి శెట్టమ్మ దీసిన రూపాయి తల్లి కొంగుముడిలోకి బోయింది.

ఆశతో కళ్ళప్పగించి బొమ్మకోసరం చూసిన పసిమనసు ముడుచుకుపోయింది. బజారంట వస్తూంటే చూసినంతసేపు జూసి వుండబట్టలేక అడిగినాడు "యినాకమయ్య గొనుక్కుందామా..."

ఎంత తొందరగా కొన్కువెళ్ళి తమ్ముణికి జూపిస్తామా అని వుంది.

"ఓరి ఎర్రి మొగమా...రూపాయికే యినాకనుయ్య వస్తాడురా...."ఆగకుండా నడుస్తూనే అంది.

"మరి రూపాయి దీసుకున్నవు..." వుక్రోషంగా అడిగాడు.

'యింట్లో దేనికన్నా బనికొస్తుందని......"

తన ఆశ తెలుసుకోటం లేదు తల్లి. తమ్ముడెంత సంబరపడ్తాడని అనుకోదేం...

"అడిగి సూస్తామా..." కోరికతో నిండిన ఆ అభ్యర్థనకు తల్లి మనసు కరిగిపోయింది.

ఒక్కో బొమ్మా చూస్తూంటే కిష్టుడి కళ్ళు చెదిరిపోతున్నాయి. అన్నీ ముట్టుకుని చూడాలని వుంది,

చిన్నవీ, పెద్దవీ, కూచున్నవీ, నిలబడినవీ, డాన్సుచేసేవీ అబ్బ ఎం బొమ్మలు నాయినో... చూడటంలోనే మురిసిపోతున్న కిష్టుడు 'పద' అంటూ తల్లి రెక్కబట్టుకొనేసరికి యీ లోకంలోకి వచ్చాడు.

ఆశగా, ఆత్రంగా తల్లి చేతులవైపు చూశాడు. ఖాళీ...

కొంగుముడి అట్లే వుంది. యిప్పనే లేదు... అంటే...

"అమ్మా బొమ్మేదే...'గొణిగాడు.

"నాయినా...అయి మనలాంటాల్లకు గాదుగాని పదపద పని పంచేటు"బరబర అడుగులు వేసింది.



"ఎంతంటనే..."

"ఎంతయితేనేంరా. మనక్కాదు. రూపాయబలూపాయలు బెట్టి యాడ గొంటం. మీ బాబు సంపాయిస్తున్నాడా ......పా...పా......"

కండ్లలో నీళ్ళు గిర్రున తిరిగాయి కిష్టడికి.

'బాబు సంపాయిస్తే బాబునే అడిగుండేటోన్ని. నీకాడ ఎందుకడుక్కుంట...మా నాయనే దెచ్చి యిచ్చేటోడు' మనసులోనే గొణుక్కున్నాడు. ధర్మాసుపత్రిలో రెండు కాళ్ళకు కట్లు గట్టుకున్న తండ్రి కండ్లముందు మెదిలాడు వాడికి.

"ఏంటయిందో ... ఎన్నాళ్లయింది ఆసపత్రిలో జేరి..." పక్క గుడిశ ముందు పిల్లలతో ఆడుకుంటున్న చంటోడు పరుగెత్తుకొచ్చి తల్లి కాళ్ళను చుట్టేసినాడు.

"బొమ్మ...అమ్మా...యినాకమయ్య దెచ్చినవా..." తలత్రిప్పుతూ ఆశగా అడుగుతున్న తమ్ముణ్ని జాలిగా చూసి, తల్లివైపు నిష్ఠూరంగా చూసి లోపలికి వెళ్ళేడు కిష్టడు.

"బజారుకు బోలేదురా సంటీ... రేపు దెచ్చుకుందాం......దా...దా...బువ్వ జేసుకుందాం..."

చంటోడిని చంకవేసుకుని గుడిశలోకి దూరిన తల్లిని చూసి 'అన్నీ అబద్దాలు ...' అంటూ గొణిగాడు కిష్టడు.

'రేపు దెచ్చుకుందాం' అని చెప్పిన తల్లి మాటలమీద నమ్మకంతో, ఆశతో తమ్ముడితోపాటు తానూ యింట్లోనే వుండి ఎంతగానో ఎదురుచూశాడు. బజారులో తను చూసిన బొమ్మలు ఎట్లా వున్నాయో. ఎలకలు ఎంతెంతవున్నాయో డ్యాన్సు చేసే వినాయకుడు ఎట్లా వంగినాడో, ఆ తొండము, పొట్ట...అన్నీ వర్ణించి...వర్ణించి వాడివి మురిపించాడు. తనూ మురిసిపోయాడు.

అంతదూరం నుండే తల్లి చేతుల్లో సంచి గమనించి...

'రేయ్ యినాకమయ్య దెచ్చింది అమ్మ...' ఇద్దరూ పరుగుతీసి సంచి లాక్కున్నారు.

పొద్దుటినుండీ పొంగిన మురిపెం. కొన్ని క్షణాలముందు పెల్లుబికిన ఆనందం నీరుగారిపోయినాయి.

సంచి విసిరికొట్టినాడు చంటోడు. దాన్లోని ఆకుకూర, నాలుగు పచ్చిమిరపకాయలు, వుల్లిపాయలు చెల్లాచెదరయ్యాయి.

అంతే అందినచోట అందినట్టు పట్టుకుని బాదింది ముత్యాలు.

తమ్ముడికి అడ్డంబోయిన కిష్టడు తన్నులు తిన్నాడు.

ఆ పూటకు తన్నులే తప్ప అన్నం కూడా తినకుండా బెక్కుతూనే నిద్రబోతున్న బిడ్డలను కావిలించుకుని ఏడ్చింది ముత్యాలు.

* * *

ఆ మరుసటిరోజు చంటోడు మారాం చేస్తాంటే గుడిశకు బీగంపెట్టి పిల్లలిద్దరినీ తీసుకుని పనిలోకి వెళ్ళింది ముత్యాలు.

పనయి తిరిగి వస్తాంటే కళకళలాడిపోతున్న బజారు, కిష్టడు నిన్నంతా వర్ణించి చెప్పిన బొమ్మలు, చంటాడి కళ్ళలోబడినాయి.

దాంతో వాడు వినాయకుని బొమ్మ కోసం ఏడవటం తల్లి నాలుగు ఉతకటం ...వాడు చాపమీద పడి దొర్లుతూ ఏడ్చటం..

"కూడుగావాల్నా, ఒద్దురే..."

మాట్లాడకుండా వెళ్ళి కంచంముందు కూచున్నాడు కిష్టడు. వాడికి బాగా ఆకలిగా కూడా వుంది.

"రారోయ్... సంటీ..." ఒక్క కేకబెట్టింది.

ఏడుపుదప్ప వాడినుండి సమాధానమే రాలేదు.

తల్లికి కోపం వస్తున్నట్టు గ్రహించాడు కిష్టడు. 'రా...రా...' అన్నట్టు చేయివూపి సైగచేశాడు.

వాడసలు కిష్టుడి సైగలు చూసే స్థితిలో లేడు. ఒకటే ఏడుపు.

"సచ్చినోడా...నీఅగు...నీ కడుపే మాడుతుంది. కడుపుగాల్తే... నాకేస్తవా కుక్కకేస్తవా అని లగెత్తుకొస్తావ్ నువ్వే..." రుసరుసలాడుతూ చాపమీద పడుకున్న తల్లిని అంటిపెట్టుకుని పడుకున్నాడు కిష్టడు.

ఏడ్చి ఏడ్చి కీచుగొంతుక పడిన తమ్ముడ్ని చూస్తే వాడికి జాలిగానూ వుంది. 'వాడట్లా ఏడుస్తాంటే అమ్మకు నిద్రెట్లా బడుతుందో...'అనుకున్నాడు.

వున్నట్టుండి మెలకువ వచ్చింది కిష్టడికి.

తల్లి చిన్న కంచంలో అన్నంతెచ్చి ముద్దలు కలిపి తమ్ముడి నోట్లో పెడుతోంది ఒళ్ళో కూచోబెట్టుకుని.

"సంటీ...కన్నా...బువ్వ దినకుంటే యీ సిన్నపొట్ట ఏడుస్తుందిరా. నీ పొట్ట ఏడిస్తే యిగో మీ యమ్మపొట్టా ఏడుస్తుంది. సూడూ..."

వాడి చేతిని తన పొట్టమీద బెట్టుకుని రుద్దింది. వాడు బెక్కుతూనే ముద్దలు మింగుతున్నాడు.

"రేపు గదా పండగ. యినాకపయ్యను గొనుక్కొస్తా. ఏడవమాకు. సూడు. ఒళ్లు ఎచ్చబడ్డది...యిగో యిగో... యిదొక ముద్ద దినేయి..."

చేయి కడుక్కుని, మూతి తుడిచి సంటోడిని తన పొట్టమీద పడుకోబెట్టుకున్న తల్లికి దగ్గరగా జరిగి మెడచుట్టూ చేయివేశాడు కిష్టడు.

* * *

ఒళ్ళు వెచ్చబడిన చంటోడికి కిష్టడ్ని కావిలిబెట్టి పనికిబోయింది ముత్యాలు.

"అమ్మ యీ పొద్దు దెస్తుందిరోయ్" కరాకండిగా తమ్ముడితో అంటున్నాడు మాటమాటకీ కిష్టుడు.

సాయంత్రం సంచిలోంచి వినాయకుడి బొమ్మను తీసింది ముత్యాలు.

అల్లంత దూరంనుంచి తల్లి రాకను గమనించి ఆత్రుతగా ఎదురుచూస్తున్న యిద్దరూ ఒక్క వుదుటున సంచిముందు మోకాళ్ళమీద కూర్చుని ఆశగా ముందుకు వంగారు.

మాయల మరాఠీవాడు సంచిలోంచి అద్భుతమైన వస్తువును తీసేటప్పటి ఆత్రుత' వుత్కంఠ వాళ్ళలో.

"యిగ్గో వినాకమయ్య..." వూరిస్తున్నట్టు బొమ్మ బయటకి తీసింది. యిద్దరి ముఖాలూ ఆ బొమ్మకన్నా నల్లబడ్డాయి.

క్షణంలో వూహించనిది జరిగింది.


చంటోడు ఆ బొమ్మ లాక్కుని ఒక్క విసురున గోడకేసి కొట్టాడు.

రంగుల వినాయకుడి బొమ్మ మీద అల్లుకుంటున్న వాడి వూహలు చిన్నాభిన్నమయినట్టు ఆ బొమ్మ ముక్కలు ముక్కలయింది క్షణంలో.

అంతే. చెక్కబట్టి పక్కకు తోసిన తోపుకు కిష్టుడు గోడకువెళ్ళి చేరబడ్డాడు?

పూనకం వచ్చినదానిలా రెచ్చిపోయింది ముత్యాలు.

"నీకేం పొయ్యేకాలం వచ్చిందిరా శనేశ్రుడా...సామిబొమ్మ పగలేసినవు పండగనాడు. ఏడ్సి సస్తున్నావే అని రెండ్రూపాయలుబెట్టి తెస్తే బొచ్చలుగా పగలగొడ్తవా... ఐదులు, పదులు బెట్టి రంగులబొమ్మలు దెచ్చేదానికి మీ తాత ముల్లెవుందేట్రా దరిద్రపుగొట్టమొగమా ...రొండ్రూపాయలు నేల పాల్జేస్తివి గదరా తిన్నట్టులా, తాగినట్టులా..." మీదమీద పడుతున్న దెబ్బలను తన చిన్న చిన్న చేతులతో కాచుకోలేక ఏడుపు వెళ్ళగక్కటానికి కూడా వ్యవధి లేనంతగా చరుస్తున్న ఆ చేతుల ధాటికి




ఆగలేక వుండలా చుట్టుకుపడిపోయాడు చంటోడు.

◆ ◆ ◆

జ్వరంతో మూసిన కన్ను తెరవకుండా పడున్న తమ్ముణ్ణి చూస్తే ఏడుపొస్తావుంది కిష్టుడికి.

పండగ హడావిడిలో యిళ్ళలో పనెక్కువగా వుంది ముత్యాలుకు.

తప్పెట్లు, తాళాలు హోరున వినబడటంతో బయటకి పరుగుదీశాడు కిష్టుడు. వూరేగింపుగా వినాయకులను తీసుకుపోతున్నారు జట్లుజట్లుగా...ఒక్కో జట్టు ఒక్కోరకం వినాయకుడు. ఒక్కో జట్టు ఒక్కోరకం వాయిద్యం. మైమరచిపోయి కాసేపు చూసి తమ్ముడు గుర్తొచ్చి మళ్ళీ పరుగుతీశాడు. అంత నీరసంలోనూ 'ఏందది' అన్నట్టు కళ్ళెగరేసి సైగచేశాడు చంటోడు.

"వినాకమయ్యలను నీల్లలో ఏసేదానికి దీస్కబోతున్నారు," చెప్పాడు కిష్టుడు.

'ఔనా' అన్నట్లు చూశాడు చంటోడు. వాడి కళ్ళలో మెరిసిన మెరుపు, వెనువెంట మూసుకున్న చీకటి కిష్టుడి గుండె కలచివేసింది.

జాలిగా వాడి తలమీద చేయివేసి నిమిరాడు. మెరుపులా తళుక్కుమంది ఆలోచన.

"ఒరే చంటీ ... నీకు రంగుల యినాకమయ్య గావాల కదూ..."

"ఆ...ఆ..."అన్నట్టు ఆశగా తల వూపాడు చంటోడు.

"నేను దెచ్చిస్త. సరేనా... నువ్వు జొరం దెచ్చుకోగూడదు. అమ్మతో దెబ్బలు తినగూడదు. ఏడ్చకూడదు మరి..."

'సరే' నన్నట్టు తల వూపాడు చంటోడు. వాడి ముఖంలో సంభ్రమం.

"అమ్మతో చెప్పకు. రేపు పొద్దున్నే దెచ్చిస్త" తమ్ముడి చెవిలో గుసగుసగా చెప్పాడు కిష్టుడు.

ఆ రాత్రి నిద్రలో కిష్టుడి కనులనిండా రంగురంగుల వినాయకుళ్ళు. చంటోడి కలలనిండా ఒకే ఒక పేద్ద రంగుల వినాయకుడు.

చెరువు దగ్గర గుంపులు గుంపులుగా జనం.

అందరి చేతుల్లోనూ వినాయకుడి బొమ్మలు, పత్రి, హారతులు, తప్పెట్లు తాళాలు...

ఆడా, మగా, పిల్లా, పెద్దా... తిరణాలలా వుంది చెరువుకట్ట.

క్రిష్టుడు అందరి మధ్యలోంచి చూరు తున్నాడు. అన్ని వినాయకుళ్ళను చూస్తు న్నాడు.

ఒకచోట ఆడవాళ్ళంతా వాళ్ళు తెచ్చిన వినాయకుళ్ళను పెట్టి మంత్రాలు చదువుతూ పూజలు చేసి, పాటలు పాడి హారతులిచ్చారు. ఒక్కొక్కరే తమ వినాయకుడిని భక్తితో కళ్ళకు అద్దుకుని నీళ్ళలోకి విసురుతున్నారు. కొన్నిచోట్ల మగవాళ్ళు, పిల్లలు బుట్టలలో, సంచు లలో తెచ్చిన వినాయకులను, పూజా పత్రిని నీళ్ళలో ముంచుతున్నారు.

వీటన్నిటి మధ్యా చెరువులో యీత కొడుతూ విసిరేయబడుతున్న విగ్ర హాలను నీళ్ళలోంచే అందుకొని పరుగులు తీసి ఎత్తుకెళ్ళిపోతున్నారు కొందరు తుంటరి పిల్లలు.

క్రిష్టుడంతా ఒకసారి కలయజూశాడు. వాడికీ యీత వచ్చు చాల కొద్దిగా. అయినా నీళ్ళను చూస్తే భయంగానూ, ఆ కోలాహలంలో మరీ బెరుకుగానూ వుంది.

ఆడవాళ్ళు పూజలు చేస్తున్నవేపు వెళ్ళాడు.

చాలామంది అప్పటికే వేసేశారు. యింకా కొందరు పూజ్య ముగించలేదు. నెమ్మదిగా ఒకావిడ వెనక్కి చేరాడు.

"అమ్మగారూ మీ వినాకమయ్యను నాకిచ్చేస్తారండి. మా తమ్ముడేస్తున్నాడు బొమ్మ గావాలన్ని. నీల్లలో ఏసే బదులు..."

అంటరానివాడిని చూసినట్టు ఒక్క చూపు విసిరి విగ్రహాన్ని నీళ్ళలోకి శక్తికొద్దీ విసిరింది ఆవిడ.

చిన్నబోయింది క్రిష్టుడి ముఖం. మరింత ముందుకు వెళ్ళాడు మెట్ల వెంబడి.

"అమ్మాయిగారూ...మా తమ్ముడికి జొరమండి. యినాకమయ్యా గావాల్నని దుస్తుంప డాడు; నీల్లలో ఏస్తే కరిగి




పోతుందండి - నా కిచ్చేయండి. మా తమ్ముడు..."

"ఏమ్, నువ్వెవరవురా... జరుగు జరుగు ... వినాయకుణ్ణి యివ్వాలట వినాయకుణ్ణి...వెధవలు. మళ్ళీ అటూ యిటూ అమ్ముకొని అందినంత డబ్బులు చేసోక్కేదానికి...పూజ చేసి తెచ్చింది నీకోసమే నాయినా పాపం ..." వ్యంగంగా అంటూ బుడుక్కున ముంచింది ఆ అమ్మాయిగారు పూజా విగ్రహాన్ని.

"అవ్వా!...అవ్వా...మా తమ్ముడు యీ బొమ్మ జొరంతో.........

ఏడుపు వస్తోంది క్రిష్టుడికి. వాడి కళ్ళ నిండా నీళ్ళు. వాడి మనసు నిండా తను తీసుకెళ్ళే బొమ్మకోసం ఎదురుచూసే తమ్ముడు...

"ఏమ్ అబ్బాయ్ ... తప్పుకో... ముట్టుకునేవు ... అలా యివ్వకూడదు నాయనా...అపచారం ...... పూజచేసి నీళ్ళలో కలిపేయాలి..."

నిస్సహాయంగా చూశాడు క్రిష్టుడు.

వాడి కళ్ళముందు వాడు కోరుకుం టున్న, వాడి తమ్ముడు కలవరిస్తున్న రంగురంగుల వినాయకులు నీళ్ళలో మునిగిపోతున్నారు...మునిగిపోతున్నారు. యింటిదగ్గర తమ్ముడు...రాత్రి తను తమ్ముడి చెవిలో చెప్పిన మాటలు వాడి కళ్ళలో మెరిసిన కాంతి...

క్రిష్టుడు నీళ్ళలోకి దిగాడు. భయం వల్లనో. నీటి చల్లదనం వల్లనో వాడి ఒళ్ళు ఝల్లుమంది. నరాలు జివ్వు మన్నాయి.

కొద్దికొద్దిగా నీళ్ళలోకి వెళ్ళాడు.

పిల్లలు యీత కొడ్తున్నారు. విసి రేస్తున్న బొమ్మలకోసం పోటీలు పడి తోసుకొంటున్నారు. నీళ్ళలో పడ్డ బొమ్మలు రంగు చెదరకముందే చేతుల లోకి ఎత్తేసుకుంటున్నారు.

చిక్కినట్టే చిక్కిన క్రిష్టుడి చేతిలో బొమ్మలను ఒక్కతోపుతో లాక్కు పోయారొకరు.

లాభంలేదు కాస్త వెనక్కు వెళ్ళాలి, యీ గుంపుకు దూరంగా వెళ్ళాలి.

విగ్రహాలు విసిరేవాళ్ళుకూడా యీ తుంటరి గుంపుకి అందనంత దూరంగా విసురుతున్నారు కొందరు.

అదిగో...ఎవరో ఇద్దరు ఒకేసారి రెండు బొమ్మలు విసరాలని పైకెత్తి పట్టుకున్నారు. రంగురంగుల పెద్ద బొమ్మలు చిన్న పూలహారాలతో కూడా వున్నాయి.

తుంటరి గుంపు దృష్టి అటు మళ్ళ లేదు యింకా. అక్కడే దేవులాడు తున్నారు వాళ్లు.

కాస్త వెనక్కి వెళ్ళాడు నీళ్ళలో కిష్టుడు. కాళ్ళు సరిగా ఆనుతున్నట్టులేదు వాడికి. ఆ బొమ్మ విసిరేస్తే పట్టుకుని వెళ్ళిపోవచ్చు. అదే చూస్తున్నాడు.

ఆ యిద్దరూ విసిరారు విగ్రహాలు.

చేతులు బారజాచి తయారుగా వున్న కిష్టుడు అవి తన అంచనాకన్నా కాస్త దూరం పడటంతో ముందుకు వంగాడు.

బొమ్మయితే చేతుల్లోకి వచ్చింది. కాళ్ళు తేలాయి. నేల అందటంలేదు. ఒక్కచేత్తో బొమ్మను గుండెకు అదిమి పట్టుకుని మరో చెయ్యి నీళ్ళపైకి లేపాడు.

వెల్లకిలా పడ్డాడు.

ముక్కుల్లోకి, నోట్లోకి నీళ్ళు ప్రవాహంలా పోయాయి.

తపతప వూపిరాడనట్టు కొట్టుకున్నాడు. తలను విదిలించాడు.

'బొమ్మ యీ రంగుల యినాకమయ్య తమ్ముడి కియ్యాలి...'

సందిట్లో గట్టిగా బిగించి పట్టుకున్న బొమ్మ సడలలేదు.

వాడి కళ్ళముందు తమ్ముడు... వాడి కళ్ళలో తన మాటంటు మెరసిన మెరుపు...నీళ్ళలో ఎగిరెగిరిపడ్డాడు...

తమ్ముడు...... తమ్ముడు ...... వినాయకయ్యా.........

కాయశక్తులా పైకి రావాలని ప్రయత్నం చేశాడు...కాని కాని నలుగురైదుగురు కలిసి పైకి తీసేవరకు పైకి రాలేకపోయాడు కిష్టుడు.

* * *

చెరువుగట్టు తిరణాలులా వుంది. జనం గుంపులు గుంపులుగా వున్నారు. వచ్చేవాళ్ళు వస్తున్నారు. విగ్రహాలు నదిలో వదిలి వెళ్ళేవాళ్ళు వెడుతున్నారు ఓ పక్కగా...గట్టుమీద...

“కిష్టుడూ...నా కన్నా...తండిరీ.. నా కడుపులో చిచ్చుబెట్టినవు కదురా... పాడుముండను పదిరూపాయలకు జూసుకుని నిన్ను పోగొట్టుకుంటి గదరా... నీవిట్ట జేస్తవని అనుకునుంటే నా తల తాకట్టుబెట్టి, తెచ్చిందు గదరా బొమ్మను ...నాయినా కిష్టా ... నీ పొట్టకు అకలయితే నా కడుపు కాలుతుండిరా...నేను బెట్టే బువ్వ తినేదానికి నువ్వు లేనే లేవనుకుంటే ... కడుపే గాదురా... యీ గుండె కాలిపోతావుందిరా...”

గుండెలు బాదుకుంటూ ... బిడ్డ చేతులు, చంపలు ముద్దులాడుతూ విలపిస్తోంది ముత్యాలు.

యివేమీ అర్థంకాని చంటోడు అన్న తనకు తెచ్చిస్తానన్న బొమ్మను తెచ్చినందుకు ముఖమంతా కళ్ళు చేసుకుని కిష్టుడి సందిట్లో యిరుక్కుపోయిన బొమ్మను తీసుకోవాలని తాపత్రయ పడుతున్నాడు.

ఎందరో వస్తున్నారు. పూజలు చేస్తున్నారు. బాజాభజంత్రీలతో మేళతాళాలతో విగ్రహాల్ని వూరేగింపుగా తెచ్చి చెరువు నీటిలో నిమజ్జనం చేస్తున్నారు. □